# భారత-పాకిస్తాన్ మైత్రి: స్పష్టతలేని వైఖరి

-కె. బాలగోపాల్

రాజకీయాలలో అబద్ధాలు మామూలే గానీ అంతర్జాతీయ రాజకీయాలు ఈ విషయంలో ఆంతరంగిక రాజకీయాల కన్నా మరీ అధ్వాన్నం. ఎందుకంటే పదవికోసమో పార్టీ శ్రేయస్సు కోసమో అబద్ధం చెప్పటం తప్పనుకునే వారు సహితం దేశంకోసం అబద్ధం చెప్పటంలో తప్పేమీలేదని భావిస్తారు. దానిని అబద్ధంగా గుర్తించడానికి సహితం చాలా మంది సిద్ధపడరు. తెలుగుదేశం-కాంగ్రెస్ పార్టీల సంవాదాన్ని అబద్ధాల పంచాంగం అనినంత సులభంగా భారత-పాకిస్తాన్‌ల సంవాదం గురించి అనగలమా?

అనలేముగానీ వాస్తవానికది అబద్ధాల పంచాంగమే. మన పాలకులు ఒకేసారి పాకిస్తాన్ గురించి ఎన్ని నోళ్లతో మాట్లాడుతున్నారో గమనించండి. అద్వానీ మన దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు- (ఒక్క కరవు సమస్యను మినహాయించి)- పాకిస్తాన్ మీద నిందవేసి తిడుతుంటాడు. ఆయన అభిప్రాయాన్నే భారత ప్రభుత్వం అభిప్రాయాలని భావించినట్టయితే భారత్ దృష్టిలో పాకిస్తాన్ ఒక భయంకరమైన కుట్రదారు, రాక్షసి అని భావించవలసి ఉంటుంది. నిన్నటికి నిన్న నకిలీ స్టాంపుల కుంభకోణంలో కూడా పాకిస్తాన్ హస్తం చూసేదాకా పోయాడాయన.

ఇక దేశ ప్రధాని మాటకొస్తే అన్ని విషయాలలాగే ఈ విషయంలోనూ ఆయనకు ఒక నిలకడయిన వైఖరి లేదు. 'సీమాంతర ఉగ్రవాదాన్ని' రెచ్చగొడుతున్న టెర్రిస్టు దేశంగా ప్రపంచం నేత పాకిస్తాన్‌ను గుర్తింపజేయాలన్న ఆరాటం ఒక చివర, స్నేహ హస్తం మరొక చివర, మధ్యలో అప్పటి శ్రోతలను బట్టి రకరకాల అభిప్రాయాలు ఆయన నోటి నుండి వింటుంటాం. పాకిస్తాన్‌తో కాశ్మీర్ సమస్యతో సహా అన్నీ చర్చించడానికి సిద్ధమేనని ఇవ్వాళ అనగలగడం, ఆ సంగతి మనం రేపు పత్రికలలో చదివి హర్షింపచేయాలంటే పాక్ ఆక్రమిత కాశ్మీరును మనకు వెనక్కి ఇచ్చే విషయం తప్ప పాకిస్తాన్‌తో కాశ్మీర్ గురించి మాట్లాడేది ఏమీలేదని అనగలడు.

రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్‌కు భారత పాకిస్తాన్‌లు రెండు దేశాలుగా, రెండు సమాజాలుగా కాక రెండు 'సైన్యాలుగా' కనిపిస్తున్నాయి. ఆయన దానికి ఉచితమైన భాషే మాట్లాడతాడు. విదేశాంగ మంత్రి యశ్వంత్ సిన్హా కొంచెం అద్వానీలాగా కొంచెం జార్జి ఫెర్నాండెజ్‌లాగా మాట్లాడుతుంటాడు.

వీటిల్లో దేనిని పాకిస్తాన్ పట్ల భారత్ వైఖరిగా భావించాలి? అసలు భారత్‌కు పాకిస్తాన్ పట్ల ఒక నిర్దిష్టమైన వైఖరి ఉందని భావించాలా?

నిజం చెప్పాలంటే మన దేశనాయకులెవ్వరికీ పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవడం పట్ల చిత్తశుద్ధి లేదు. కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ మనల్ని ఇబ్బంది పెట్టకుండా చూసుకోవడమొక్కటే మన నాయకులకు కావలసింది. అమెరికాను మంచి చేసుకొని కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ చేతులూ, నోరు కట్టేస్తే ఇక ఆ పైన పాకిస్తాన్ అనే దేశమొకటి ఉందనే మరచిపోయి బతకొచ్చని వారి అభిప్రాయం. 'సెప్టెంబర్ 11' తరువాత ఈ అవకాశం పెరిగిందని గట్టిగా నమ్ముతున్న వారిలో అద్వానీ ముఖ్యుడు. ఆ గాలి ఇటు మళ్లించి పాకిస్తాన్ బెడదను ఒక్కసారిగా వదిలించేసుకుందామని అతని ఉబలాటం. అద్వానీ బయటపడి మాట్లాడుతున్నాడు గానీ వారి ఖాకీ నిక్కరు వ్యాయామశాల లోపనే కాక దానికి వెలుపల కూడా చాలా మంది భారతీయుల వైఖరి ఇదే. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు వాటంతటవి విలువయినవంటే ఈ వైఖరి ఒప్పుకోదు. పోనీ శాంతి కోసం స్నేహ సంబంధాలు అవసరమంటే, బెదిరించి శాంతి నెలకొల్పడం అంతకంటే సులభమైన మార్గం కాదా అంటుంది. అణుబాంబు అందుకోనవే తయారుచేసుకున్నారు- దానిని చూసి పాకిస్తాన్ కూడా భయపడి కాశ్మీర్ సంగతి మరచిపోయి మనతో రాజీకొస్తుందని. మన అణు విస్ఫోటనానికి ప్రతిగా పాకిస్తాన్ కూడా అణు విస్ఫోటనం చేపట్టేసరికి ఈ ఆశ కుప్పకూలిపోయింది. ఇప్పుడు అణుబాంబు బదులు అమెరికానుచేతిలో పెట్టుకొని పాకిస్తాన్‌ను భయపెట్టాలని చూస్తున్నారు. అంతే తప్ప పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు నెలకొనాలన్న చిత్తశుద్ధి ఎవరిలోనూ లేదు. నిన్న మొన్న మన వాళ్లు అమలుచేయడానికి ఒప్పుకున్న కాల్పుల విరమణ కూడా అమెరికాను మెప్పించే ఎత్తుగడలో భాగమే తప్ప వేరే ఏమీ కాదు.

వాజ్‌పేయి లాహోర్‌కు పోలేదా, ముషారఫ్‌ను ఆగ్రాకు పిలవలేదా అంటారేమో. పోయాడు, పిలిచాడు. అది వాజ్‌పేయి పాకిస్తాన్ పట్ల అనుసరిస్తున్న రెండు నాల్కల వైఖరిలో భాగం. తన పదవి ముగిసేలోగా పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచి 'చరిత్రలో నిలిచిపోవాలన్న' కాంక్ష వాజ్‌పేయిలో బలంగా ఉందన్న అభిప్రాయమొకటి విశ్లేషకులలో ఉంది. అందులో భాగంగా ఆ ప్రయత్నాన్ని అర్థం చేసుకున్నా తప్పులేదు. అయితే దానిని అద్వానీ పనిగట్టుకొని చెడగొట్టాడనేది ఇప్పుడు బహిరంగ రహస్యం. కొంత సామరస్యపూరితమైన ఉమ్మడి ప్రకటన

ఆగ్రాలో తయారయ్యే స్థితి వచ్చింది గానీ అద్వానీ అడ్డుపడడం వల్ల అది సాధ్యం కాలేదు. వాజ్‌పేయికి చరిత్రలో ఒకరకంగా 'నిలిచి పోవాలని' ఉన్నట్లే అద్వానీకి ఇంకొక రకంగా 'నిలిచి పోవాలని' ఉంది మరి!

అయితే లాహోర్-ఆగ్రా ప్రయత్నాలను పాకిస్తాన్ విశ్లేషకులు చూసిన తీరును పరిశీలిస్తే ఇదికూడా నిజానికి భారత్ పాకిస్తాన్ పట్ల ఎప్పుడూ అనుసరిస్తున్న వైఖరికి భిన్నం కాదని అర్థం అవుతుంది. మనవాళ్లు అప్పట్లో పాకిస్తాన్ నుండి రాబట్టాలని చూసిన ప్రకటన ఏమిటి? కాశ్మీర్‌ను పక్కన పెట్టి ఇతర సమస్యలు పరిష్కరించుకొనడానికి పాకిస్తాన్ సిద్ధమనే ప్రకటన రాబట్టాలని చూశారు. అయితే ముషార్రఫ్ పదే పదే అంటున్నట్లు కాశ్మీర్ కాక వేరే ఏ సమస్యలున్నాయి భారత్-పాకిస్తాన్‌ల మధ్య? నదీజలాలు, వర్తక వాణిజ్యాలు మొదలైనవి ఎప్పుడైనా ఉండే మోతాదులోని సమస్యలే తప్ప అంత ఆర్భాటంగా శిఖరాగ్ర సమావేశం నిర్వహించుకోనిదే పరిష్కారం కానివేవీకావు.

ఒకవేళ ఉన్నాయనే అనుకున్నా కాశ్మీర్‌ను పక్కనపెట్టి వాటి గురించి మాట్లాడుకుందామన్న ప్రతిపాదన వెనుక కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ బెడద వదిలివేసుకుందామన్న ఆరాటమే తప్ప వేరే సదుద్దేశ్యమేమీ లేదన్న పాకిస్తాన్ విశ్లేషకుల వ్యాఖ్యను కొట్టిపారేయలేము. సులభంగా పరిష్కారం కాగల సమస్యలతో మొదలుపెట్టి చర్చలు ప్రారంభిస్తే, కష్టతరమైన కాశ్మీర్ సమస్య పరిష్కారానికి కావలసిన స్నేహ వాతావరణం ఏర్పడుతుందని మనవాళ్లు చాలా తెలివిగా సూచిస్తున్నారుగానీ అవన్నీ పరిష్కారం అయిపోయిన తరువాత భారత్ కాశ్మీర్ విషయం మరచిపోయి ఇంటికి వెళ్లిపోదన్న నమ్మకం ఏమిటని వారి వాదన.

కాశ్మీర్ విషయం పాకిస్తాన్‌తో మాట్లాడడానికి భారత్ సిద్ధంగా లేదంటున్నారు, పాకిస్తాన్ మాత్రం సిద్ధంగా ఉందా అంటారేమో. చాలా కాలం పాటు పాకిస్తాన్ పాలకుల వైఖరీ ఇదే. అమెరికా చేయూతనిస్తే యుద్ధం చేసి కాశ్మీర్ వివాదాన్ని పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ చూసింది. అయితే 1971 'బంగ్లాదేశ్ యుద్ధం' తరవాత, బంగ్లాదేశ్ వేర్పాటు తరవాత, ఆ ఆలోచన బలహీనపడింది. 1989లో కాశ్మీర్‌లో స్వయం నిర్ణయాధికార పోరాటం మొదలైన తరవాత పాకిస్తాన్‌కు మరొకసారి కాశ్మీర్ వివాదాన్ని తనకు అనుకూలంగా పరిష్కరిచుకునే అవకాశం లభించింది. ఒక పాకిస్తానీ మానవహక్కుల ఉద్యమకారుడు వ్యాఖ్యానించినట్టు, కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారం విషయంలో పాకిస్తాన్‌ది విచిత్రమైన వైఖరి. కాశ్మీరీలకు పాకిస్తాన్‌ను కోరుకునే మేరకు మాత్రమే స్వయం నిర్ణయాధికారం ఉంటుంది. స్వతంత్రంగా బతకాలని కోరుకునే అధికారాన్ని పాకిస్తాన్ ఒప్పుకోదు.

ఏమయితేనేం కాశ్మీరీలు స్వయం నిర్ణయాధికార పోరాటాని పాకిస్తాన్ చాలా సహాయం చేసింది, చేస్తున్నది. ఆ సహాయమే లేకపోతే కాశ్మీరీలు ఇప్పటిదాకా పోరాటం చేయగలిగేవారు కారు. పాకిస్తాన్ ఉద్దేశ్యాలు ఏవయినా కాశ్మీరీల ఆరాటం న్యాయమైనది. కాబట్టి ఈ విషయంలో పాకిస్తాన్ ఒక చారిత్రిక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నదని ప్రపంచంలోని అత్యధిక దేశాల అభిప్రాయం. (మ[illegible] పత్రికలో మనకు వినపడకుండా దాచి పెడుతున్న ప్రపంచ సత్యాలలో ఇదొకటి).

అయితే ఈ సహాయాన్ని కాశ్మీరీలకు చేసే సహాయంగా చూసినా, పాకిస్తాన్ తన తొలినాటి ఆకాంక్షను పరిపూర్తి చేసుకోవడానికి జరుపుతున్న కృషిగా చూసినా, ఈ బరువు, ఈ ఖర్చు, పాకిస్తానీ సమాజం ఇంకెంత కాలం మోయాలన్న ప్రశ్న ఒకటి పాకిస్తాన్‌లో మొలకెత్తింది. పాకిస్తాన్ ఒక ఆధునిక పారిశ్రామిక దేశంగా అభివృద్ధి చెందాలని కాంక్షించే మధ్యతరగతి ఆ దేశంలో కొంత బలపడింది. వారు ఈ ప్రశ్న బలంగా లేవదీస్తున్నారు. ఇది పాకిస్తానీ పాలకులను ప్రభావితం చేస్తున్నదని భావించడానికి ఈమధ్యనే ఇండియాలో పర్యటించిన పాకిస్తానీ జమాతెఇస్లామీ నాయకుడి ప్రకటన ఒక నిదర్శనం.

దీనికి ఒక నేపథ్యం ఉంది. అది అమెరికా సామ్రాజ్య విస్తరణ వ్యూహంలోని దుర్మార్గపు ఎత్తుగడల పర్యవసానం. అఫ్ఘానిస్తాన్ నుండి రష్యాను తరిమివేయడానికి అమెరికా 'ఇస్లామిక్ ముజాహిద్దీన్'ల సైన్యాన్ని తయారుచేసిన సంగతి తెలిసిందే. ఇస్లాంను వ్యాపింప చేయడానికీ ముస్లింలు ఎక్కడున్నా అక్కడ సనాతన ఇస్లామిక్ రాజ్యాలు స్థాపించడానికీ ఆయుధాలు పట్టుకొని బయలుదేరడానికి తయారుగా ఉన్న సాయుధ జిహాదీలు అప్పటిదాకా ఒకటి రెండు పశ్చిమాసియా దేశాలలో చిన్న చిన్న గుంపులుగా ఉండేవారు. వారంతటవారు అంతకంటే ఎప్పటికీ ఎదగక పోదురేమో. కానీ అమెరికా తన అఫ్ఘానిస్తాన్ ప్రతి వ్యూహం కోసం వారందరినీ ఒక చోట చేర్చి మిలిటెంట్ల ఫ్యాక్టరీ నెలకొల్పింది.

ఆ 'చోటు' పాకిస్తాన్. అప్పటి నుండి పాకిస్తాన్‌లో వీధివీధికీ ముజాహిద్దీన్‌లు తయారయ్యారు. అమెరికా వ్యూహం ఫలించింది. రష్యా, అఫ్ఘనిస్తాన్ నుండి వెళ్లిపోయింది, కానీ అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ చాలా నష్టపోయాయి. మతహింసకు స్థావరాలయ్యాయి. దానినుండి అఫ్ఘానిస్తాన్‌ను 'కాపాడడానికి' అమెరికాయే ఆ దేశం మీద మరొకసారి యుద్ధం చేయడం వేరేకథ.

పాకిస్తాన్‌లో అమెరికా విత్తనం నాటిపోయినా పాక్-ఇస్లామిక్ మిలిటెన్సీ పట్ల ఆ దేశంలోని ఆలోచనాపరులలో వ్యతిరేకత బాగా పెరిగింది. వారంతా హేతువాదులు, నాస్తికులు, కమ్యూనిస్టులు

రు. పాకిస్తాన్ ఒక ... మునిక దేశంగా ఎదగాలని కోరుకుంటున్న రందరూ ఈ సాయుధ జిహాదీలు పెద్ద ఆటంకం అని ర్తిస్తున్నారు. వాళ్లు ఇతర ప్రాంతాలలో కాశ్మీర్ నుండి చెచెన్యా కా పోరాటాలు చేయడమేకాక పాకిస్తానీ సమాజాన్ని సాయుధంగా సించే ప్రయత్నం కూడా చేస్తున్నారు.

ఇండియాతో కాశ్మీర్ వివాదాన్ని ఏదో ఒకరకంగా తెంపుకోనంత లం ఈ మిలిటెంట్ల బెడద పాకిస్తాన్‌కు పోదని పాకిస్తాన్‌లో ల్లామంది ఈ రోజు భావిస్తున్నారు. ఆ ఒత్తిడి పాకిస్తాన్ పాలకుల ద్ద ఉంది. అందుకు భిన్నమైన దిశగా ఒత్తిడి పెట్టే ప్రభావాలూ వా అంటే ఉన్నాయి. అయితే ఈ కారణంగా పాకిస్తాన్ పాలకులు ండియాతో చర్చలు జరిపే విషయంలో మనవాళ్ల కంటే కొంచెం న్సియర్‌గానే ఉన్నారు.

మన సమస్య ఏమిటంటే పాకిస్తాన్‌ను ఒక ఇస్లామిక్ భూతంగానే ప్ప ఇంకొకరకంగా మనం చూడలేం. ఆ దేశంలోనూ భిన్న ఆరాటాలు, ఆకాంక్షలూ ఉన్నాయన్న ప్రాథమిక సత్యాన్ని సహితం మనం గుర్తించం. మన రాజకీయాలు, మన పత్రికలు, ఈ మధ్యకాలంలో సినిమాలు పాకిస్తాన్ గురించి ఒక మూస అభిప్రాయాన్నే కలిగిస్తున్నాయి, పెంచి పోషిస్తున్నాయి.

మనం మారనిదే మన పాలకులు ఎందుకు మారుతారు? వాళ్ల వైఖరి మార్చుకోవాలన్న ఒత్తిడి మన నుండి రానిదే అదెందుకు మారుతుంది? కానీ దీనికి కావలసిన కృషి చేయడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? జాతీయవాద ఆవేశంతో ఉన్న సుఖం, హేతుబద్ధమైన వివేచనలో లేదు. అయితే దానిని బలంగా చేపట్టకపోతే మాత్రం భారత-పాకిస్తాన్ చర్చల పేరుతో అబద్ధపు ప్రహసనం సాగుతూనే ఉంటుంది. మొన్న ప్రకటించినట్టు కాల్పుల విరమణ అప్పుడప్పుడు ప్రకటించడమూ జరుగుతుంటుంది. మరొక పక్క ఆయుధాల తయారీ, కొనుగోలు, దిగుమతి, సైన్యాల మోహరింపు సాగుతూనే ఉంటాయి.

(వ పేజీ తరువాయి)

## నిబద్ధతకు నారు పోసిన నార్ల వేంకటేశ్వరరావు (1908-1985)

నార్ల రాసిన "సీతజోస్యం" అనే నాటకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. పాఠకలోకంలో తీవ్ర చర్చకు తెరలేసిందీ సాహిత్య అకాడమీయే (ఈ రచనపై) తీవ్ర విమర్శ చేసింది. ఆచరణ కర్తలే విమర్శించడం తగదని నార్ల తీవ్ర అభ్యంతరాన్ని లిపారు. ఈ కారణంగానే సాహిత్య అకాడమీ వారి పురస్కారాన్ని ం నార్ల తిరస్కరించారు. అలాగే విశ్వనాథ సత్యనారాయణ, పాటి వేంకటాచలం రచనలను నార్ల తిరస్కరించారు.

తరువాతి క్రమంలో నార్ల రాసిన మరో నాటకం, 'నరకంలో శృంద్ర'. దీన్ని ఈ వ్యాస రచయితకే అంకితమిచ్చారు. నాటకం "ద్రౌపతి". ముందు "పాంచాలి" అని పేరిడి తరువాతి లో ద్రౌపతిగా మార్చారు. నార్ల వారి రచనల్లో పాత-కొత్త ఎంపికచేసి ప్రచురించారు. పురాణ వైరాగ్యమనే అసంపూర్ణ సైతం వుంది. నార్ల తన భావాలను, నవయుగాల బాట బాట అన్న ముగింపుతో వేయికిపైగా పద్యాలను వెలువర్చారు. వీటిల్లో సాంఘిక దురాచారాల పట్ల ఘాటైన విమర్శ, మానవ విలువల పునరుద్ధరణ లక్ష్యంగా కనిపిస్తుంది. వివిధ అనుభవాలను, అనుభూతులను, విరుద్ధ వ్యక్తులతో ఎదుర్కొన్న ముఖాముఖి సందర్భాలను రాయాలని తపన పడ్డా వివిధ కారణాల మూలంగా వెయ్యివరకూ రాయలేకపోయారు. చివరిరోజుల్లో ఎన్టీఆర్ ప్రభుత్వానికి సాంస్కృతిక సలహాదారుగా సైతం నార్ల వేంకటేశ్వరరావు గారు కొద్దికాలం సేవలందించారు.

నార్ల సతీమణి సులోచన అన్నివిధాలా వారికి సహకరించారు. తమ సహజీవనంలో నార్ల నమ్మింది ఆచరణలో పెట్టగల ధీరోదాత్తుడు. పిల్లలలో కొందరు కులాంతర వివాహాలను చేసి వారిని ప్రోత్సహించారు. రెండు విశ్వవిద్యాలయాలు "డాక్టరేట్"లతో ఆయన్ని గౌరవించినా, ఒక్కనాడూ ఆయన పేరుముందు 'డాక్టర్' అని పెట్టేందుకు ఆయన అనుమతించలేదు. నమ్మింది ఆచరిస్తూ...... పాత్రికేయ లోకానికి చిరస్మరణీయుడు, ఆదర్శప్రాయుడుగా నిలిచారు శ్రీ నార్ల వేంకటేశ్వరరావు.

స్వేచ్ఛానువాదం : విద్యాభూషణ్

## చందాదారులకు విజ్ఞప్తి

మొదటి సంచిక నుంచి చందాదారులుగా చేరినవారి చందా డిసెంబరు నెలాఖరుతో ముగుస్తుంది. వారు అంతా తిరిగి చందాదారులుగా చేరి వార్షిక చందా 120 రూ.లను మనీఆర్డరు లేదా డ్రాఫ్టు రూపంలో పంపడం ద్వారా మా ఈ కృషికి మీ సహకారాన్ని అందించాలని కోరుతున్నాం.

సం./-